తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ | బుధవారం | 25 - 02 - 2026 | ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి | పేజిలు : 6

# వేటాడాడు..వేటేశాడు



# భూతగాదాలో..
# వదినపై మరిది హత్యాయత్నం

- కొబ్బరిబోండాలు కొట్టే కత్తితో వదిన మెడ నరికిన మరిది
- ఇద్దరు మేనల్లుళ్లతో కలిసి దాడికి పాల్పడిన వైనం
- పరారీలో నిందితులు, కుటుంబ సభ్యులు
- ప్రాణాపాయ స్థితిలో ఉన్న వదిన..ఆస్పత్రిలో చికిత్స
- యాదాద్రి జిల్లా మోత్కూరు మండలం పాలడుగులో ఘటన
- మరిది దాడులు, వేధింపులపై పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు



ప్రజావారధి/మోత్కూరు

భూతగాదాలో వదినపై మరిది హత్యాయత్నానికి పాల్పడ్డాడు. తన ఇద్దరు మేనల్లుళ్లతో కలిసి ప్లాన్ చేసిన మరిది వ్యవసాయ బావి వద్ద ఒంటరిగా ఉన్న వదినపై కొబ్బరిబోండాలు కొట్టే కత్తితో మెడపై నరికాడు. దీంతో ఆమె ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, నిందితులు, కుటుంబ సభ్యులు పరారీలో ఉన్నారు. ఈ దారుణ ఘటన యాదాద్రి జిల్లా మోత్కూరు మండలం పాలడుగు గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... పాలడుగు గ్రామానికి చెందిన బొంత నర్సింహ, అశోక్ అన్నదమ్ములు. ఇద్దరు అన్నదమ్ములకు తండ్రి రామయ్య చెరో 8 ఎకరాల చొప్పున 16 ఎకరాల భూమి పంచి ఇచ్చాడు. తమ్ముడు అశోక్ జల్సాలకు అలవాటు పడి తన భాగానికి వచ్చిన భూమిలో సుమారు 5 ఎకరాల వరకు అమ్ముకున్నాడు. దీంతో అన్న నర్సింహ భూమిలో నుంచి కొంత భూమి తనకు ఇవ్వాలంటూ తమ్ముడు అశోక్ గత కొన్నేండ్లుగా గొడవ పడుతున్నాడు. భూతగాదాలతో అనారోగ్యం పాలైన అన్న నర్సింహ సుమారు ఆరు నెలల క్రితం చనిపోయాడు. దీంతో అన్న భూమిపై కన్నేసిన తమ్ముడు వదిన లక్ష్మీని రకరకాలుగా వేదిస్తూ దాడులు, గొడవలకు పాల్పడుతున్నాడు. ఇంటిపై దాడి చేసి ఇంట్లో వస్తువులన్నీ పగులకొట్టి భూమి పట్టాకాగితాలు, బంగారం ఎత్తుకపోయాడని బాధితురాలు గతంలో పోలీసులకు ఫిర్యాదు చేయగా, అతని నుంచి ప్రాణ భయం ఉండటంతో స్వంత ఇంటిని వదిలి కూతురు, ఇద్దరు కొడుకులతో కలిసి అతని ఇంటికి దూరంగా ఓ పెంకుటింట్లో అద్దెకు ఉంటోంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ బావి వద్ద పొలం నాటు వేయగా గురువారం కూలీలతో యూరియా చల్లించింది. కూలీలు వెళ్లిపోగా పని ఉండటంతో వదిన లక్ష్మీ బావి వద్దే ఉంది. మేనల్లుళ్లతో కలిసి రెక్కీ నిర్వహిస్తూ మాటువేసిన మరిది అశోక్ వ్యవసాయ బావి వద్ద వదిన లక్ష్మీ ఒంటరిగా ఉన్నట్లు తెలుసుకుని బావి వద్దకు వెళ్లారు. మేనల్లుల్లు లక్ష్మీని పట్టుకోగా మరిది అశోక్ కొబ్బరిబోండాలు కొట్టే కత్తితో లక్ష్మీ మెడపై నరికాడు. చేతులతో అడ్డుకోబోగా రెండు చేతివేళ్లు తెగాయి. కత్తి వేటుతో లక్ష్మీ కేకలు వేయడంతో ముగ్గురు నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. రక్తస్రావం అవుతుండగా మెడకు టవల్ చుట్టుకుని లక్ష్మీ ఊళ్లోకి వచ్చింది. లక్ష్మీని తీవ్ర రక్తస్రావంలో చూసిన గ్రామస్తులు వెంటనే 108కు, పోలీసులకు ఫోన్ చేశారు. 108లో లక్ష్మీని చికిత్స కోసం..

2లో..

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
బుధవారం
జనరల్ న్యూస్
25 - 02 - 2026


# వదినపై మరిది హత్యాయత్నం





**మొదటి పేజీ తరువాయి..**
భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. లక్ష్మీ కోమాలోకి వెళ్లి పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మరిది అశోక్‌తో పాటు అతని మేనళ్లుల్లు పరారీలో ఉండగా, అశోక్ కుటుంబ సభ్యులు కూడా ఇంటికి తాళం వేసి పరారయ్యారు. మోత్కూరు సీఐ వెంకటేశ్వర్లు పోలీస్ సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకుని సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దాడికి ఉపయోగించిన కొబ్బరిబోండాలు కొట్టే కత్తిని స్వాధీనం చేసుకున్నారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూతగాదా కారణంగా కోర్టులో కేసుతో పాటు పెద్ద మనుషుల వద్ద పంచాది నడుస్తోందని, మరిది అశోక్ పెడుతున్న ఇబ్బందులపై బాధితురాలు లక్ష్మీ పలుమార్లు మోత్కూరు పోలీసులకు కూడా ఫిర్యాదు చేసిందని గ్రామస్తులు చెబుతున్నారు. హత్యాయత్నంపై బాధితురాలు లక్ష్మీ అక్క చంద్రమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. లక్ష్మీకి చిన్నపిల్లలు కూతురు రామేశ్వరి, కుమారులు రాంచరణ్, చంద్రశేఖర్ ఉన్నారు. ఇదిలా ఉండగా సంఘటనపై సమాచారం వచ్చిన వెంటనే సుమారు 15 నిమిషాల్లో 108 వాహనం గ్రామానికి చేరుకుని బాధితురాలిని ఆస్పత్రికి తరలించగా..సమాచారం అందుకున్న పోలీసులు మాత్రం సుమారు గంట తర్వాత వచ్చారని గ్రామస్తులు ఆరోపించారు. గతంలో తప్పతాగి లారీ డ్రైవర్ డివైడర్‌ను ఢీకొడితే 15 నిమిషాల్లో వచ్చిన పోలీసులు మనిషిని నరికితే ఆలస్యంగా రావడంపై విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. మరిది అశోక్, వదిన లక్ష్మీ మధ్య జరుగుతున్న భూతగాదా కేసులో పోలీసులు మొదటి నుంచి వ్యవహరిస్తున్న తీరు అంతా వివాదాస్పదంగా ఉందని గ్రామస్తులు చర్చించుకోవడం కనిపించింది.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
బుధవారం



# రైతుబంధుకు పైసల్లేవ్ గానీ.. గాంధీ విగ్రహానికి, గాంధీల కుటుంబానికి ఇచ్చే వేల కోట్లు ఎక్కడివి.?

- పేదల ఇండ్లు కూల్చడమేనా ఇందిరమ్మ రాజ్యం
- అన్నం పెట్టే కాళేశ్వరం వద్దు.. 5 వేల కోట్లతో కట్టే గాంధీ విగ్రహం ఎవరి మెప్పు కోసం
- సీఎం పదవిని కాపాడుకోవడానికే రేవంత్‌రెడ్డి ఆరాటం

## మోత్కూరు మార్కెట్ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్ రెడ్డి



ప్రజావారధి/మోత్కూరు

రైతులకు రైతుబంధు ఇవ్వడానికి పైసల్లేవంటున్న సీఎం రేవంత్ రెడ్డి..గాంధీ విగ్రహం పెట్టడానికి రూ.5 వేల కోట్లు, గాంధీల కుటుంబానికి ఇవ్వడానికి రూ.వెయ్యి కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలకు చెప్పాలని మోత్కూరు మార్కెట్ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి రైతులను ఏమాత్రం పట్టించుకోవడం లేదని, అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వారిని అరిగోస పెడుతున్నారన్నారు. పంట పెట్టుబడి సాయం రైతుబంధు ఇవ్వకుండా ప్రభుత్వం ఎగ్గొడుతుందని, సకాలంలో యూరియా అందించకుండా నానా ఇబ్బందులకు గురి చేస్తుందని తెలిపారు. కేసీఆర్ రైతాంగానికి సాగునీరు అందించే కాళేశ్వరం కడితే సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారని, అన్నం పెట్టే కాళేశ్వరం కన్నా రూ.5 వేల కోట్లతో కడుతున్న గాంధీ విగ్రహం ఎవరికి ఉపయోగపడుతుందని, ఎవరి మెప్పు కోసం పెడుతున్నారో తెలంగాణ ప్రజలకు చెప్పాలన్నారు. ఒక్క విగ్రహం పెట్టడానికి వేల పేదల ఇండ్లు కూల్చుతున్నారని, ఇందిరమ్మ రాజ్యం, గాంధీ గ్రామ స్వరాజ్యం అంటే ప్రజల ఇండ్లు కూల్చడమేనా అని ప్రశ్నించారు. ఖమ్మంలో ప్రభుత్వం వేల పేదల ఇండ్లు కూల్చి భూములు లాక్కుంటుందని, మూసీ సుందరీకరణ పేరుతో వేల ఎకరాల భూసేకరణ పేరుతో లక్షల కుటుంబాలను రోడ్డున పడేసేందుకు పూనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. రెండేళ్ల కాలంలో ప్రజల ఇండ్లను కూలి భూములు లాక్కోవడం తప్ప చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలైన రైతు భరోసా రూ.15 వేలు, తులం బంగారం, మహిళలకు రూ.2500, పింఛన్లు వృద్ధులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు అమలు చేయడం లేదన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు, అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయడం లేదని తెలిపారు. తెలంగాణ ప్రజల సొమ్ము రూ.5 వేల కోట్లతో కట్టే గాంధీ విగ్రహం, గాంధీల కుటుంబానికి ఇచ్చే రూ.వెయ్యి కోట్లు ఢిల్లీ పెద్దల మెప్పుతో రేవంత్ రెడ్డి తన సీఎం పదవిని కాపాడుకోవడానికి పాకులాడుతున్నాడని విమర్శించారు. ఓటుకు నోటు దొంగ రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు ఏం చేయలేకపోయినా నోట్లతో పదవులు వస్తాయన్న నమ్మకంతోనే పాలన సాగిస్తున్నాడని, మోత్కూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో కూడా చివరి క్షణంలో ఏ విధంగా గెలిచారో ప్రజలు గమనించారన్నారు. గాంధీ విగ్రహం కోసం ఖర్చు చేసే రూ.5 వేల కోట్లు, గాంధీల కుటుంబానికి ఇచ్చే రూ.వెయ్యి కోట్లు మొత్తం రూ.6 వేల కోట్లు తెలంగాణ ప్రజల సొమ్ము అని, ఆ డబ్బులను వెంటనే రైతులకు రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
25 - 02 - 2026



రెడ్డి సంఘం ఆధ్వర్యంలో..

# మున్సిపల్ కౌన్సిలర్లకు సన్మానం

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మున్సిపల్ ఎన్నికల్లో 5వ వార్డు కౌన్సిలర్‌గా మొగుళ్ల అనురాధశ్రీనివాస్‌రెడ్డి, 8వ వార్డు కౌన్సిలర్‌గా పన్నాల శ్రీవిద్యశ్రీనివాస్‌రెడ్డి గెలుపొందడంతో మంగళవారం మోత్కూరు రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పూలమాలలు, శాలువలతో వారిని సన్మానించి శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం అధ్యక్షుడు లింగాల జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని, పేద ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. నిత్యం ప్రజల్లో ఉండి పనిచేస్తూ ప్రజాసేవతో మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు డాక్టర్ లక్ష్మీనర్సింహారెడ్డి, పైళ్ల సోమిరెడ్డి, కొంతం నాగార్జున రెడ్డి, ముప్పా వెంకటరెడ్డి, సోలిపురం చంద్రారెడ్డి, అర్ద ప్రతాప్ రెడ్డి, బద్దం నాగార్జున్ రెడ్డి, పసునూరి చంద్రారెడ్డి, గంట వేమల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కౌన్సిలర్ శ్రీకాంత్ జన్మదిన వేడుకలు



మోత్కూరు మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ నాయకులు బీసు శ్రీకాంత్ గౌడ్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వారి సమక్షంలో జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే శ్రీకాంత్‌కు శాలువాలు కప్పి స్వీట్లు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ నాయకులు పర్రెపాటి యుగేంధర్, చేడె మహేందర్, చేడె అంబేద్కర్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

-ప్రజావారధి/మోత్కూరు





# మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లకు సన్మానం





**ప్రజావారధి/మోత్కూరు**

మోత్కూరు మున్సిపల్ నూతన చైర్మన్‌గా ఎన్నికైన గడ్డం స్వప్నసోమనర్సయ్య, వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్నలను మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు ధర్మాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని పూలమాలలు, శాలులతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వర్రె మహేందర్, వర్రె లింగయ్య, అంకర్ల రమేష్, నంది క-ష్ణారెడ్డి, వర్రె సోమయ్య, రేపాక కుమారస్వామి, వర్రె వెంకటయ్య, జినుకల లింగయ్య, అంబటి నాగరాజు, వర్రె సురేష్, ఎనుగుల నర్సింహ, మాంద్ర మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## పారిశుధ్య పనులను పరిశీలించిన మున్సిపల్ వైస్ చైర్మన్

- **మార్నింగ్ వాక్‌లో కార్మికుల సమస్యలు తెలుసుకున్న వైస్ చైర్మన్ వెంకన్న**



**ప్రజావారధి/మోత్కూరు**

మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో మంగళవారం మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఉదయం మార్నింగ్ వాక్‌లో భాగంగా ఆయన కార్మికులు చేస్తున్న పనులను రోడ్లను ఊడ్చడం, చెత్త సేకరణ, మురికి కాల్వల శుభ్రతను పరిశీలించారు. కార్మికులంతా సమస్వయంతో పని చేసి పారిశుధ్యం పేరుకపోకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా కార్మికులను వారి సమస్యలు, వారికి అందాల్సిన సౌకర్యాలు, వేతనాలు సక్రమంగా వస్తున్నాయా లేదా అన్నది అడిగి తెలుసుకున్నారు. కౌన్సిల్‌లో కార్మికుల సమస్యలపై చర్చించి నెలనెలా వేతనాలు అందించడంతో పాటు వారికి అందాల్సిన కిట్లను అందేలా చూస్తామని, ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తేవాలని సూచించారు. అనంతరం 1వ వార్డులో పర్యటించి వార్డుల్లోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సక్రమంగా లేని కరెంట్ లైన్లను, కిందకు వేళాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయాలని ట్రాన్స్‌కో ఏఈ ప్రభాకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వచ్చి పరిశీలించి వెంటనే సరి చేయిస్తానని చెప్పారని తెలిపారు. వార్డులో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పూర్తి చేసేలా చూస్తానన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
25 - 02 - 2026

# చిన్నారి హత్య నిందితులను కఠినంగా శిక్షించాలి




## బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళి

ప్రజావారధి/మోత్కూరు

నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర జాతరలో రజక సామాజిక వర్గానికి చెందిన చిన్నారిని హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి  రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని శ్రీకాంతాచారి చౌరస్తాలో చిన్నారి హత్య చేసిన దుండగులను శిక్షించాలని కోరుతూ చిన్నారికి కొవ్వత్తులతో నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి మండల పట్టణ అధ్యక్షుడు శివార్ల  శ్రీనివాస్ యాదవ్, నిలిగొండ మత్స్యగిరి, నాయకులు బుశిగంపల సందీప్,  చేతరాశి వెంకన్న, రజక సంఘం నాయకులు బొడ్డుపల్లి మైసయ్య, కూసంపల్లి సోమనర్సయ్య, కూసంపల్లి యాకయ్య, బొడ్డుపల్లి మహేష్, బొడ్డుపల్లి శివాజీ, బొడ్డుపల్లి సర్వయ్య, అవిశెట్టి కిరణ్, బందెల రవి, అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# భువనగిరి మున్సిపల్ చైర్మన్‌ను కలిసిన 1వ వార్డు కౌన్సిలర్

## చైర్మన్ శ్రీవాణిరవికుమార్‌ను సన్మానించిన కౌన్సిలర్ భువనేశ్వరిశివకుమార్



ప్రజావారధి/మోత్కూరు

భువనగిరి మున్సిపల్ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన తంగెళ్లపల్లి శ్రీవాణిరవికుమార్‌ను మంగళవారం 1వ వార్డు కౌన్సిలర్ ఏల భువనేశ్వరిశివకుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువ కప్పి ఘనంగా సన్మానించి శు భాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా వార్డులో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు వార్డులో అభివృద్ధి పనులకు పూర్తి సహకారం ఉంటుందని చైర్మన్ హామీ ఇచ్చారని తెలిపారు.